www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 9 డిసెంబర్ 2022

ముత్యాలరావుకు ఏపిఆర్‌సెట్‌లో 2వ ర్యాంకు

ప్రజాశక్తి- గోకవరం

ఏపిఆర్ సెట్ హిందీ విభాగంలో పిహెచ్‌డి కోర్సు కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో స్టేట్ 2వ ర్యాంకును తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కాకర ముత్యాలరావు సాధించారు. ఈ సందర్భంగా ముత్యాలరావుని మండల నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు అభినందించారు. ముత్యాలరావు ఒక సాధారణ మధ్య తరగతి గీత కార్మికుని కుమారుడు. ముత్యాలరావుకి హిందీ పట్ల మక్కువ ఎక్కువ. ఎంతోమంది విద్యార్థులకు, డిఎసిసి అభ్యర్థులకు హిందీని ఉచితంగా బోధిస్తున్నాడు. ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ప్రిపేర్ అవుతున్నట్లు ఆయన తెలిపారు.

రైతుల్లో తుపాను గుబులు

ఆర్‌బికెల్లో నత్త నడకన కొనుగోళ్లు

చేలలోనే ధాన్యం రాశులు

పంటను కాపాడుకునేందుకు రైతుల యత్నాలు

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

రైతులను తుపాను గుబులు వెంటాడుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ప్రారంభమైన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది తుపానుగా మారుతుందని వాతావరణశాఖ ప్రకటనతో అన్నదాతల్లో ఆందోళన మరింత రెట్టింపైంది. పంటను రక్షించుకునేందుకు వారు నానా పాట్లు పడుతున్నారు. కొనుగోళ్ల నత్తనడకన సాగుతుండటంతో చాలా మంది రైతులు పంటను చేలల్లోనే కుప్పలుగా వేశారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో వాటిపై టార్పాలిన్లు కప్పుతూ కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినప్పటికీ వాన పడితే నష్టం ఎదుర్కోక తప్పదన్న ఆవేదన వారిని వెంటాడుతోంది. జిల్లా వ్యాప్తంగా 85 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు నత్తనడకన సాగుతున్నాయి. సాంకేతిక సమస్యలు, గన్నీ బ్యాగుల కొరత వెంటాడుతోంది. చేతికి అందిన పంటను గిట్టుబాటు ధరకు అమ్ముగలమో.. లేదోనని ఆందోళన చెందుతున్నారు. 9,10 తేదీల్లో తుపాను ప్రభావం అధికంగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో అందరిలోనూ అలజడి నెలకొంది.

కపిలేశ్వరపురంలో బరకాలతో కప్పిన ధాన్యం రాశులు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో 85 శాతం కోతలు పూర్తయ్యాయి. ఎప్పటికప్పుడు రైతుల నుంచి ధాన్యం సేకరణ జరుగుతోంది. మిగిలిన 15 శాతం కోతలను రైతులు వాయిదా వేసుకోవటం మంచిది. వాయుగుండం ప్రస్తుత దిశ ఆధారంగా జిల్లా తీవ్ర ప్రభావం ఉండకపోవచ్చు. దిశ మార్చుకుంటే ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. రైతులు అప్రమత్తంగా ఉండాలి.

- ఎస్. మాధవరావు జిల్లా అధికాధి వ్యవసాయ శాఖ

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతోంది. నూతన సాంకేతిక విధానంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. ఇక కొనుగోళ్లే తరువాయి' అన్నట్లు అధికారులు తొలుత ప్రకటించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి. జిల్లాలో 1.48లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. 6.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. 4.50 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యంగా తీసుకున్నారు. అయితే ఇప్పటి వరకూ 28,914 మంది రైతుల నుంచి 1.39 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. లక్ష్యంలో కేవలం 30 శాతం మాత్రమే చేరుకున్నారు. గత రెండు రోజులుగా అధికారుల గణాంకాలను పరిశీలిస్తే రోజుకు 2,300 మెట్రిక్ టన్నులు చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు స్పష్టం అవుతోంది. ఈ విధంగా కొనుగోలు చేస్తే లక్ష్యసాధన సాధ్యమేనా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. తేమశాతం, ఇతర నిబంధనల పేరుతో కొర్రీలు పెట్టడమే వెనుకబాటుకు కారణమని తెలుస్తోంది. మరో వైపు గన్నీ బ్యాగుల కొరత, రవాణాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అటు రవాణా, హమాలీ ఖర్చులను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని చెబుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా రవాణా చార్జీల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. ఈ పరిణామాలన్నీ కొనుగోళ్లపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో ధాన్యం నిల్వలు కల్లాలు, పొలాలకే పరిమితమవుతున్నాయి

వాతావరణ మార్పులతో గుబులు

వరి కోతలు పూర్తయ్యేనాటికి వాయుగుండం వార్త ఆందోళనకు గురి చేస్తోంది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో రైతులు పొలాలకు పరుగులు తీస్తున్నారు. కోసిన పంటను సంరక్షించే పనిలో పడ్డారు. ఎక్కువ మంది రైతులు యంత్రాలతో నూర్పులు చేస్తున్నారు. దీంతో నేరుగా ధాన్యం కల్లాల్లోకి చేరుతున్నాయి. మరోవైపు కాలువ, నది పరీవాహక ప్రాంతాల్లోని పొలాల్లో నీటి తడులు ఉన్నాయి. అటువంటి చోట ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. సంప్రదాయ పద్ధతిలో కోసిన వరిచేను ఎండిన తరువాత కుప్పలు పెట్టాల్సి ఉంటుంది. వర్షంతో పాటు చిన్న గాలి వీచినా వరి వర్రిన్నాలవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉన్న ఎండతీవ్రత సాయంత్రానికి తగ్గింది. గాలులు వీయటంతో ఆందోళన మరింత రెట్టింపవుతోంది.

విజిట్ల పేరుతో వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

విజిట్ల పేరుతో అంగన్‌వాడీలపై వేధింపులు ఆపాలని ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.బేబిరాణి, కె.సుబ్బరావమ్మ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తూర్పుగోదావరి జిల్లా గాదాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ కమిటీ విజిట్లు పేరుతో అంగన్‌వాడీలపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నదన్నారు. దీనివల్ల అంగన్‌వాడీలు తీవ్ర మానసిక ఆందోళనకి గురవుతున్నారన్నారు. ఈ కారణంగానే అంగన్‌వాడీ వర్కర్ సుబ్బలక్ష్మి విధుల్లోనే గుండెపోటుకు గురై మృతి చెందిందని తెలిపారు. మూడు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా కందిపప్పును సరఫరా చేయటంలేదన్నారు. కోడిగుడ్లు సక్రమంగా రావటంలేదని తెలిపారు. నాసిరకం కిట్లు సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఇవేమీ ఫుడ్‌కమిషనర్‌కు కనిపించలేదా అని ప్రశ్నించారు. సెంటర్ అద్దెలు, గ్యాస్ బిల్లులు, కూరగాయల బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో అంగన్‌వాడీలపై మరింత భారం పడుతుందన్నారు. వచ్చే అతితక్కువ జీతంతో కుటుంబాన్ని, మరోపక్క అంగన్‌వాడీ సెంటర్‌లో పెట్టుబడులు పెట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుబ్బలక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

ఎస్ఎఫ్ఐ 17వ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ అఖిలభారత మహాసభ డిసెంబర్ 13 నుంచి 16 వరకు తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరుగుతాయన్నారు. ఈ మహాసభలో దేశంలో విద్యారంగం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లపై తీర్మానాలు చేసి భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేస్తారన్నారు. దేశంలో నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగంలో అనేక మార్పులు చేస్తూ విద్యారంగాన్ని భ్రష్టు పట్టించే ఆలోచనలో ఉన్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని రూపొందిస్తామని తెలిపారు. వీటిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు సత్య, నాయకులు వీరబాబు, ప్రసన్న విద్యార్థులు పాల్గొన్నారు.

వేగంగా జియో స్పేషియల్ టెక్నాలజీ అభివృద్ధి

ప్రజాశక్తి – రాజానగరం

ప్రపంచంలో అత్యంత వేగంగా జియోస్పేషియల్ టెక్నాలజీస్ అభివద్ధి చెందుతుందని, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జియోస్పేషియల్ టెక్నాలజీస్ అభివద్ధికి కషి చేస్తున్నామని విసి మొక్కా జగన్నాథరావు అన్నారు. గురువారం జియోసైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో 'రిమోట్ సెన్సింగ్, జియో స్పేషియల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, డిజిటల్ ఇమేజ్ ప్రోసెసింగ్ ల్యాబ్‌ను విసి ప్రారంభించారు. తరువాత గరుడలిటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, నన్నయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మ, గరుడలిటిక్స్ సిఇఒ డాక్టర్ వివిఎస్ఎస్.కిరణ్ ఎంఒయు పత్రాలపై సంతకాలు చేసి పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ప్రపంచంలో జియోస్పేషియల్ టెక్నాలజీస్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. జియోస్పేషియల్ టెక్నాలజీస్ అవశ్యకత ఎంతో ఉందని, రానున్న ఐదేళ్ల కాలంలో దేశంలో సుమారు నాలుగులక్షల యాభై వేలు ఉద్యోగాలు వస్తాయన్నారు. జియాలజీ, జియోఫిజిక్స్, సివిల్, కంప్యూటర్ సైన్స్, లైఫ్ సైన్సెస్ విద్యార్థులకు జియోస్పేషియల్ టెక్నాలజీస్‌లో శిక్షణ ఇప్పిస్తే చక్కని ఉద్యోగాలు వస్తాయన్నారు. జియోస్పేషియల్ టెక్నాలజీస్ ప్రాధాన్యతను గుర్తించి అన్ని రకాల వసతులతో నన్నయ జిఐఎస్ ల్యాబ్‌ను ప్రారంభించామన్నారు. గరుడలిటిక్స్ ఎంఒయు ద్వారా నన్నయ విద్యార్థులకు జియోస్పేషియల్ టెక్నాలజీస్‌లో శిక్షణ, ప్రాజెక్ట్ వర్క్స్, ఇంటర్న్ షిప్, ప్లేస్‌మెంట్స్ ఇస్తారన్నారు. ప్రతి సంవత్సరం రెండు మూడు వారాల గురడలిటిక్స్ నుంచి నిష్ణాతులు వచ్చి శిక్షణ కార్యక్రమాలు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తారని తెలిపారు. గరుడలిటిక్స్, నన్నయ ఫ్యాకల్టీ కలిసి జాయింట్ రీసెర్చ్ ప్రాజెక్ట్స్, కన్సల్టెన్సీలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో 'జియోస్పేషియల్ టెక్నాలజీస్ – ఉద్యోగావకాశాలు అనే అంశంపై నిర్వహించిన వర్క్ షాప్‌లో గరుడలిటిక్స్ సిఇఒ డాక్టర్ వివిఎస్ఎస్.కిరణ్ మాట్లాడారు. విసి విద్యార్థుల ఉన్నతి కోసం కషి చేస్తారని చెప్పారు. జియోస్పేషియల్ టెక్నాలజీస్ లోని వివిధ కేటగిరీలలో ఉద్యోగావకాశాలకు సంబంధించిన అంశాలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఒఎస్‌డి ఎస్.టేకి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమణేశ్వరి, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ కె.నూకరత్నం, ఆచార్య వై.శ్రీనివాసరావు, డాక్టర్.కె.వి.స్వామి, డాక్టర్.కె.ఎస్.పీటర్, డాక్టర్.కె.సుధారాణి పాల్గొన్నారు.

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న విసి జగన్నాథరావు

నేడు కొవ్వూరులో జాబ్ మేళా

ప్రజాశక్తి – కొవ్వూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యోగ కల్పన అధికారి కె.హరీష్‌చంద్రప్రసాద్ తెలిపారు. కొవ్వూరులో నిర్వహించిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. అరబిందో, జిఎస్ఎల్, వరుణ్ మోటార్స్ అపోలో ఫార్మసీ, అనంతలక్ష్మీ స్పిన్నింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్, వికలాంగుల కోసం రిలయన్స్, డిమార్ట్ సంస్థలలో వివిధ ఉద్యోగాలలో పనిచేసేందుకు ఈ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. పాలిటెక్నిక్, ఐటిఐ, బిఎస్‌సి కెమిస్ట్రీ, 10వ తరగతి, ఇంటర్ పూర్తి చేసిన 30ఏళ్ల లోపు వారు దీనికి అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆయా కంపెనీలను బట్టి వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు బయోడేటా, ఆధార్, పాన్, సర్టిఫికెట్ల జిరాక్సులతో మేళాకు హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఎన్.ప్రశాంత్, జెడిఎం బి.సుమలత పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత తప్పనిసరి

ప్రజాశక్తి – ఉండ్రాజవరం

విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడరాదని దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల వీరవెంకటసత్యనారాయణ అన్నారు. గురువారం దమ్మెన్ను ఎంపిపి పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం అమలు తీరును ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎంఆర్‌విఎస్ఎన్.రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ సూచనల మేరకు, మధ్యాహ్న భోజన పథకం మెనూలో జరిగిన స్వల్ప మార్పులను పాటించి, అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిలో జిల్లా ప్రథమం : కలెక్టర్

ప్రజాశక్తి – ధవళేశ్వరం

జిల్లాలో ఉపాధి హామీ చట్టంలో భాగంగా 37 లక్షల పనిదినాలు లక్ష్యానికి 39.11 లక్షలు పనిదినాలు కల్పించి 105.71 శాతంతో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. గురువారం పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ అమరావతి నుంచి పల్లె వెలుగు, స్వచ్ఛ సంకల్పం, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, ఒడిఎఫ్ ప్లస్ గ్రామాలు తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, జెసి ఎన్.తేజ్‌భరత్, ఇతర అధికారులు పాల్గొన్నారు. పంచాయతీరాజ్ రాష్ట్ర కమిషనర్ శశిధర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడానికి తీసుకొచ్చిన జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం పటిష్టంగా అమలయ్యేలా చూడాలన్నారు. క్లాప్ మిత్ర గౌరవ వేతనాలను చెల్లించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సంపద కేంద్రాల షెడ్ల ఏర్పాటును వేగవంతం చేయాలన్నారు.

కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ పల్లె వెలుగు కార్యక్రమంలో భాగంగా 262 పంచాయతీల్లో ఎల్ఇడి లైట్ల కోసం నివేదిక అందించామన్నారు. 264 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ సంకల్ప షెడ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. 33 చోట్ల కొత్త షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. వాటిలో 24 షెడ్లకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. 16 గ్రామాల్లో ఒడిఎఫ్ ప్లస్ పనులు చేయనున్నామన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా సంపూర్ణ పారిశుధ్యం దిశగా పంచాయతీ తీర్మానాలను 24 గంటల్లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలైన ఆర్‌బికెలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్, డిజిటల్ లైబ్రరీల నిర్మాణాల్లో పురోగతి చూపాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ జి.నరసింహులు, డిపిఒ పి.జగదాంబ, పంచాయతీ శాఖ ఎస్ఇ ఎవిబి.వరప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శంకరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నూరుశాతం ఇళ్ల నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి – ఉండ్రాజవరం

మండలంలో నూరుశాతం ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చూడాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు అన్నారు. గురువారం ఆయన హౌసింగ్ ఎఇ ఎం.విక్టర్‌బాబుతో కలిసి ఉండ్రాజరంలోని పాత సినిమా హాలు రోడ్డులోని జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. లబ్ధిదారులకు సొంత ఇంటి నిర్మాణంపై అవగాహన కల్పించారు. విక్టర్ బాబు మాట్లాడుతూ లే అవుట్‌లోని 212 స్థలాలకు 82 నిర్మాణాలు గ్రౌండ్ లెవెల్ పూర్తయ్యాయన్నారు. మిగిలిన 130 మందికి అవగాహన కల్పించే ఉద్దేశంతో లబ్ధిదారులను కలిసినట్లు ఆయన చెప్పారు. మంచి రోజులు చూసుకొని, ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు లబ్ధిదారులు చెప్పారన్నారు. మండలంలో వంద శాతం నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ సోంబాబు, ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎస్.సుదీప్తి, పాల్గొన్నారు.

చిన్నారికి వైద్యానికి ఆదిరెడ్డి సాయం

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం సిటీ

చిన్నారి వైద్యం కోసం భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.35వేల ఆర్థిక సాయం అందించారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 49వ డివిజన్‌కు చెందిన కందుల వీరబాబు కుమార్తెకు ఈ మొత్తాన్ని ఆదిరెడ్డి అప్పారావు టిడిపి కార్యాలయంలో గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి మాట్లాడుతూ చిన్నారికి మెరుగైన వైద్యం కోసం భవిష్యత్తులో సహకరిస్తామన్నారు. పేద విద్యార్థులకు సహకారం అందించేందుకు తమ ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలం

గోపాలపురం : పోలవరం ఎస్ఇబి స్టేషన్లో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు ఈ నెల 9న బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ జె.శ్రీనివాసబాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు, విజయవాడ ఎస్ఇబి అధికారుల ఉత్తర్వుల మేరకు 45 ద్విచక్ర వాహనాలు, కారు, ఆటోలను వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనొచ్చన్నారు. వివరాలకు 9440902432, 8019852606 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పోలీస్ సిబ్బందికి యూనిఫాం అందజేత

ధవళేశ్వరం : ధవళేశ్వరంలో పోలీస్ సిబ్బందికి యూనిఫామ్‌ను సిఐ కె.మంగాదేవి చేతుల మీదుగా అందించారు. ఆలమూరుకు చెందిన పారిశ్రామికవేత్త మురళీకష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు తనయుడు, మురళీకష్ణ సినిమా థియేటర్ అధినేత మురళీకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా వీటిని సమకూర్చారు. పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న 52 మంది సిబ్బందికి యూనిఫామ్‌ను అందించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో పోలీసులకు ఎలాంటి అవసరం వచ్చిన సహకారం ఉంటుందని తెలిపారు.

భూముల రీసర్వేపై సమీక్ష

సీతానగరం : భూములపై నెలకొన్న వివాదాలను పరిష్కరించేందుకు చేపడుతున్న భూముల రీసర్వేపై తహశీల్దార్ సత్యనారాయణరాజు సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ సర్వేపై గ్రామ సభల ద్వారా ప్రజలు, రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని తెలిపారు. సర్వే చేస్తున్న సమయంలో వచ్చే వివాదాలను వెంటనే పరిష్కరించే దిశగా గ్రామ సచివాలయాల్లో విస్తతంగా ప్రచారం చేపట్టాలన్నారు. అవసరమైన పరికరాలు, డ్రోన్లు, రోవర్లు, బేస్ స్టేషన్లు, మొబైల్ ట్రిబ్యునల్స్, సర్వే బందాలకు అవసరమైన వాహనాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతేకాకుండా వాటి వినియోగంపై సర్వేయర్లకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, సర్వేయర్, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నన్నయలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

రాజానగరం : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ జరిగింది. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని విసి మొక్కా జగన్నాథరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఆదికవి నన్నన విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులంతా ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన ప్రతి విద్యార్థి ఉద్యోగాలు చేస్తూ తల్లిదండ్రులకు భరోసాగా నిలవాలన్నారు. బెస్ట్ కెరీర్స్ సహకారంతో విశ్వవిద్యాలయంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు కాప్ జెమిని, డెలాయిట్ కంపెనీలు వచ్చాయన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ. ఐదు లక్షల నుంచి రూ.7లక్షల వరకూ వేతనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ సురేష్‌వర్మ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.జగన్మోహనరెడ్డి, బెస్ట్ కెరీర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కెవి.రమణ పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా చందన చేయూత ట్రస్ట్

ప్రజాశక్తి – ధవళేశ్వరం

ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తోంది చందన చేయూత ట్రస్టు. కష్టాల్లో ఉన్న పలువురికి ట్రస్టు అధినేత, వైసిపి రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ గురువారం సాయం అందించారు. 28వ వార్డుకు చెందిన వాలంటీర్ కట్టా అనూష భర్త కట్టా సురేష్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. దీనికి స్పందించిన చందన వారికి ప్రతి నెలా మందులకు సరిపడా ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చారు. ఈ నెల ఆర్థిక సాయాన్ని అందించారు. కడియం గ్రామానికి చెందిన ముగత వీర్రాజు ఇటీవలే కిడ్నీ సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకున్నారు. వారికి మందుల నిమిత్తం ఆర్థిక సాయం చేశారు. హుకుంపేట వరలక్ష్మి కాలనీలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాపీమేస్త్రి షేక్ బాషా ఆరోగ్య పరిస్థితి సరిగాలేకపోవడాన్ని గుర్తించారు. వారికి నెలకు సరిపడ కిరాణా సరుకులు అందించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ సర్జరీ జరిగిన ఐఎల్‌టిడి జంక్షన్‌కు చెందిన శరత్ సుబ్రహ్మణ్యంకు రెండు నెలలకు సరిపడా మందులకు సాయం అందించారు.

ముగిసిన ప్రణాళిక శిక్షణ

ప్రజాశక్తి–కడియం

కడియం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న గ్రామ పంచాయతీల అభివద్ధి , ప్రణాళిక శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. వైస్ ఎంపిపి పంతం గణపతి పాల్గొని మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడియపులంక, దామిరెడ్డిపల్లి, దుళ్ల, మురమండ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు .

పలువురికి ఎంపిపి శ్రీవల్లి పరామర్శ

ప్రజాశక్తి –గోకవరం

మండలంలోని పెంటపల్లికి చెందిన ఎంపిటిసి సభ్యులు గండికోట వెంకటరమణరామకృష్ణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్రంగా గాయపడ్డారు. అదే గ్రామానికి చెందిన బండి లోవలక్ష్మి కుమారుడు ఇటీవల మతి చెందాడు. వారి కుటుంబాలను ఎంపిపి సుంకర శ్రీవల్లి, ఆమె భర్త వీరబాబు, వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, సీనియర్ నాయకులు సుంకర వెంకటరమణ గురువారం పరామర్శించారు. వారి వెంట పిఎంసి చైర్మన్ గుర్రం దుర్గాప్రసాద్, నాయకులు ఎన్.పాండురంగ, శివరామకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హిమాచల్ ప్రదేశ్‌లో విజయంపై హర్షం

ప్రజాశక్తి – పెరవలి

హిమాచల్‌ప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు అరిగెల అరుణకుమారి హర్షం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాలు, గ్యాస్, ఇతర ధరలు, మతకల్లోలాలు సృష్టిస్తున్న బిజెపి పాలనపై విసిగిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయమే దీనికి ఉదాహరణ అన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు దుర్గాప్రసాద్ ఎంపిక

ప్రజాశక్తి– గోకవరం

మండలంలోని పెంటపల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి చెన్నిబోయిన పవన్‌దుర్గాప్రసాద్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం వై.వెంకన్న తెలిపారు. గురువారం వెంకన్న ఆధ్వర్యంలో పవన్‌దుర్గప్రసాద్‌ని ఎంపిపి సుంకర శ్రీవల్లి, నాయకులు వీరబాబు, వైసిపి మండల అధ్యక్షులు పాటి రాంబాబు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థికి ఎంపిపి రూ.500 విలువ చేసే పెన్నులు అందించారు. ఎంపిపి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికవ్వాలని దుర్గాప్రసాద్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు సుంకర వెంకటరమణ, పిఎంసి చైర్మన్ గుర్రం దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎం.ప్రసన్నశివ, మాజీ సర్పంచ్ శివరామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు జి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

చాగల్లు : పంచాయతీల అభివృద్ధి ప్రణాళికకు సంబంధించి ఎంపిడిఒ బి.రాంప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఎంపిడిఒ మాట్లాడుతూ శిక్షణా తరగతులతో పంచాయతీలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మట్టా వీరస్వామి, వైస్ ఎంపిపి జె.రామచంద్రరావు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

మరేం పర్వాలేదు... త్వరలో అక్కడ 'ఆపరేషన్' కమలం ఏర్పాటు చేస్తాంగా...!!!

సీనరేజీ సొమ్ములు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి – పెరవలి

మండలంలోని ఖండవల్లి, మల్లేశ్వరం, కడింపాడు పంచాయతీలకు ఇసుక సీనరేజీ నిధులు చెల్లించాలని స్థానిక నాయకులు గురువారం ఇసుక ర్యాంపు ధర్నా నిర్వహించారు. కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం గ్రామ పంచాయతీకి సీనరేజీ సొమ్ములు భారీగా పడుతున్నాయన్నారు. నవంబర్ 6న ప్రారంభమైన గోపాలపురం–2 ఇసుక ర్యాంపు నుంచి కడింపాడు మీదుగా ఇసుక రవాణా చేస్తున్నారు. పది రోజులు ర్యాంపు నిలుపుదల చేసి అనంతరం యథేచ్ఛగా జెపి కంపెనీ తవ్వకాలు నిర్వహిస్తుందని తెలిపారు. కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం పంచాయతీ, పెరవలి మండలం ఖండవల్లి, మల్లేశ్వరం కడింపాడు గ్రామాలకు ఇసుక బౌండరీ తగువా గత కొంతకాలంగా ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవట్లేదు. ఫలితంగా తరచూ రెండు ర్యాంపుల నిర్వాహకులకు వివాదాలు తలెత్తుతున్నాయి. జెపి కంపెనీ ఇవేమీ పట్టించుకోకుండా తవ్వకాలు నిర్వహించి చేతులు దులిపేసుకుంటుందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పెరవళి మండల పరిధిలోని కానూరు– పెండ్యాల, ఉసులమర్రు, తీపరు, ఖండవల్లి, మల్లేశ్వరం, గోపాలపురం–2 ఇసుక ర్యాంపుల్లో గతంలో తవ్వకాలు జరిగేవి. ప్రస్తుతం తీపర్రు, మల్లేశ్వరం, గోపాలపురం–2 తవ్వకాలు జరుగుతున్నాయి. మల్లేశ్వరంలో కొన్ని రోజుల నుంచి తవ్వకాలు నిలిపేశారు. గత సంవత్సరం ఇసుక ర్యాంపు సినరేజ్ సొమ్ములు ఏప్రిల్‌లో ఉసులమర్రు పంచాయతీకి రూ.17 లక్షలు, తీపర్రు పంచాయతీకి రూ.12 లక్షలు పడ్డాయి. ర్యాంపు పరిధిలో ఉన్న మిగిలిన మూడు పంచయతీలకు నేటికీ ఒక్కపైసా కూడా పడలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పట్టాభి రామారావు, ఎంపిటిసి సభ్యులు బి.వెంకటేశ్వర్లు, పి.రవికుమార్, ఎ.శ్రీను గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

జాతీయ పార్టీగా... ఆమ్ ఆద్మీ పార్టీ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో ఎన్నికల్లో సాధించిన ఓట్ షేర్ ఆధారంగా ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ పార్టీగా ఆవిర్భంచిన సందర్భంగా ఆప్ ప్రత్యేక హెూదా దీక్ష శిబిరంలో సంబరాలు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన హామీలు ప్రత్యేక హెూదా కోసం మూడో రోజు రిలే నిరాహార దీక్ష ముగిసిన అనంతరం స్వీట్లు పంచి పలువురు రాష్ట్ర జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ కాకినాడ జిల్లా కన్వీనర్ నరాల శివ నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు , సిపిఎం నాయకులు పలివెల వీరబాబు, ఆల్ ఇండియా జైహింద్ పార్టీ అధ్యక్షులు దశరధి రామిరెడ్డి, ఇంద్రపాలెం అఖిలపక్ష నాయకులు చింతపల్లి ఉదయ భాస్కర్జ, జయలక్ష్మి బ్యాంకు బాధితుల సంఘం అధ్యక్షులు బద్రీనారాయణ, రాజ్యాధికార పార్టీ కాకినాడ జిల్లా కన్వీనర్ రాయుడు మోజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో విజయోత్సవం జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

కాంగ్రెస్ శ్రేణుల హర్షాతిరేకాలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 68 స్థానాలకు 41 స్థానాల్లో విజయం సాధించడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు మిఠాయిలు పంచుకుని ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉమ్మడి వెంకట్రావు ఆధ్వర్యంలో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం బాణాసంచా పేలుస్తూ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపిసిసి సభ్యులు ధర్నాలకోట శ్రీను, డిసిసి అధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్య ప్రకాశరావు, యనుమల రాజా తదితరులున్నారు.

ఒక్క రోజులో రూ.15.41 లక్షల యూజర్ ఛార్జీలు

ప్రజాశక్తి -కాకినాడ కార్పొరేషన్

యూజర్‌చార్జీల వసూళ్లలో కాకినాడ నగర పాలక సంస్థ రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందని ఇన్‌చార్జి కమిషనర్ సీహెచ్ నాగ నర్సింహారావు చెప్పారు. కాకినాడలో ప్రతి బుధవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, మేస్త్రిలు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లను టీంగా ఏర్పాటు చేసి యూజర్ చార్జీల కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. మూడు వారాలుగా చేస్తున్న ఈ ప్రయత్నానికి ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తోందని గురువారం తెలియ జేశారు. స్పెషల్ డ్రైవ్ ప్రారంభించిన తొలి వారం 7.5 లక్షలు వసూలైందని చెప్పారు. రెండో వారం (గత వారం) సుమారు పది లక్షలు వసూలు చేయగలిగామని.. ఈ బుధవారం రూ.15 లక్షల 41వేల 380 వసూలు చేశామన్నారు. ఒక్క రోజులో ఇంత పెద్ద మొత్తంలో యూజర్ చార్జీలు వసూలు కావడం రికార్డుగా తెలిపారు. కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో హూపర్ టిప్పర్ వాహనాల నిర్వహణ కోసం యూజర్ చార్జీల ద్వారా కనీసం రూ. 56 లక్షలు వసూలు కావల్సి ఉండగా ... గడిచిన మూడు, నాలుగు నెలలుగా పూర్తిస్థాయిలో వసూళ్ల చేయడంలో కూడా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. గత నెల 103 శాతం వసూళ్లు కాగా.. రెండు నెలల శాతం 114 శాతం కూడా వసూలు చేశామన్నారు. ఇందుకోసం ప్రత్యేక పర్యవేక్షణ చేసి కింది స్థాయి సిబ్బందిని సమన్వయం చేసిన స్పెషల్ ఆఫీసర్లు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, సచివాలయ అడ్మిన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, కార్యదర్శులు, మేస్త్రిలు, వలంటీర్లు, ఇతర ఉద్యోగులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

పారిశుధ్య కార్యదర్శికి షోకాజ్ నోటీసు

కాకినాడ కార్పొరేషన్ : కాకినాడ ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని విముక్తి కాలనీ ప్రాంతంలో కాకినాడ నగరపాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ సిహెచ్ నాగనరసింహారావు గురువారం పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. విముక్తి కాలనీలో పారిశుధ్య నిర్వహణ బాగానే ఉన్నప్పటికీ, ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను ఆనుకుని ఉన్న రహదారిపై భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త పేరుకు పోవడానికి గుర్తించారు. దీనికి కారణమైన పారిశుధ్య కార్యదర్శికి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్ ను ఆదేశించారు. పరిస్థితి మెరుగు పడకపోతే శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై కూడా చర్యలు తప్పవన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రి, పారిశుధ్య కార్యదర్శులు ప్రత్యేక బాధ్యత తీసుకుని ఆ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కమిషనర్ ఆదేశించారు.

పారిశుధ్య తనిఖీలు నిర్వహిస్తున్న ఎడిసి నాగనరసింహారావు

అక్రమ క్వారీలపై అధికారుల ఉదాసీనత

- ఇష్టానుసారంగా బ్లాస్టింగ్‌లు
- పేలుడులో భార్యాభర్తలు బలి

ప్రజాశక్తి - రౌతుల పూడి

అక్రమ క్వారీ తవ్వకాలపై అధికారులు ఉదాసీనత చూపుతున్నారు. ఫలితంగా అక్రమార్కులు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. ఇష్టాను సారంగా బ్లాస్టింగ్‌లు చేసి మరీ గ్రావెల్, రాళ్ల తవ్వుకుపోతున్నారు. బ్లాస్టింగ్‌లతో ప్రమాదాలు జరుగుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. తాజాగా జరిగిన అక్రమ బ్లాస్టింగ్‌ల కారణంగా భార్యాభర్తలు మృతువాత పడ్డారు. ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలారు.

రౌతులపూడి మండలం ఎస్.పైడిపాలకు చెందిన పాలోజు వరహాలు, పాలోజు లక్ష్మీదుర్గాభవాని భార్యాభర్తలు. 2014లో పెద్దలను ఎదిరించి మరీ వివాహం చేసుకున్నారు. వారికి 7ఏళ్లు, 9నెలల కుమార్తెలు ఉన్నారు. తల్లిదండ్రులకు దూరమైనా ఒంటిరిగానే బతుకుతున్నారు. సజావుగా సాగుతున్న ఈ వీరి జీవితంలో బ్లాస్టింగ్ చీకట్లను నింపింది. వారి ప్రేమకు ప్రతిరూపాలైన చిన్నారులను అనాథలను చేసింది. బుధవారం వారి పెద్ద కుమార్తె పుట్టిన రోజును కావడంతో ఉదయమే వెళ్లి కొత్త బట్టలు, కేకు భార్యాభర్తలు తీసుకొచ్చారు. సాయంత్రం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకునేందుకు ప్రణాళిక వేసుకున్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో బహిర్భూమి కోసం లక్ష్మీ దుర్గాభవానిని బైకుపై కిలోమీటరు దూరంలో ఉన్న క్వారీ ప్రాంతానికి వరహాలు తీసుకెళ్లాడు. ఈ సమయంలో క్వారీ బ్లాస్టింగ్ జరగడంతో శిథిలాల కింద ఉండిపోయారు. సాయంత్రం అయిన భార్యాభర్తలు రాకపోవడంతో స్థానికులు గాలింపు చేపట్టారు. క్వారీప్రాంతంలో బైకు ఉండటంతో శిథిలాల్లో చిక్కుకుని ఉంటారని అనుమానించారు. బుధవారం రాత్రంతా శిథిలాలల్లో రాళ్లను తొలగిస్తూ గాలించారు. గురువారం తెల్లవారినీ వారి సమాచారం అందలేదు. ఇంతో విషయం తెలుసుకున్న తుని రూరల్ సిఐ ఎ.సన్యాసిరావు, కోటనందూరు ఎస్ఐ స్వామినాయుడు అక్కడికి చేరుకున్నారు. యంత్రాలను రప్పించి శిథిలాలను తొలగించారు. శిథిలాల్లో నుజ్జు అయిన వరహాలు, లక్ష్మీదుర్గాభవాని మృతదేహాలను కను గొన్నారు. దీంతో గ్రామంలో విషాదం అలముకుంది. స్థానికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అక్రమ క్వారీలను అడ్డుకోవాలని విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని అందువల్లే ఈ ప్రమాదం జరిగిందంటూ మృతదేహాలతో అక్కడే ధర్నా నిర్వహించారు. అనాథలుగా మిగిలిన చిన్నారుకు దిక్కెవరంటూ ప్రశ్నించారు. దీంతో వారితో అధికారులు చర్చలు జరిపారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం తుని ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల రోదనలతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం అలముకుంది. చిన్నారులను చూసినవారు కంటతడి పెట్టుకుంటున్నారు.

మృతి చెందిన భార్యాభర్తలు పాలోజు వరహాలు.. లక్ష్మీ దుర్గాభవాని (ఫైల్)

ఎస్. పైడిపాల గ్రామ శివారు ప్రమాదానికి కారణమైన అనధికార క్వారీ

తవ్వకాలకు అనుమతులు లేవు

ఎస్.పైడిపాల గ్రామ శివారులో నల్లరాతి క్వారీకి అనుమతులు లేవని రెవెన్యూ, పోలీసులు అధికారులు స్పష్టం చేశారు. 15 ఏళ్ల క్రితం తవ్వకాలు జరిపి వదిలేశారని తెలిపారు. ప్రస్తుతం తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని తహశీల్దార్ ఎల్.శివకుమార్ స్పష్టం చేశారు. ప్రమాదానికి సంబంధించి బాధ్యులైపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థిని శశికళ మృతి

ప్రజాశక్తి, అన్నవరం

అన్నవరం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ మేరపల బాబురావు కుమార్తె బుధవారం దువ్వాడ రైల్వే స్టేషన్ లో ట్రైన్ దిగుతుండగా, ప్రమాదవశాత్తూ ఫ్లాట్ పామ్ మధ్యలో ఇరుక్కున్న విద్యార్థిని శశికళని బ్రతికించడా నికి వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలిం చకపోవడంతో గురు వారం ఆమె తుది శ్వాస విడిచింది. మతురాలు శశికళ దువ్వాడలో ఒక కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదువుతోంది. ఇటీవల సెలవులకని అన్నవరం వచ్చి తల్లిదండ్రులు వద్ద ఆనందంగా గడిపింది. బుధవారం ఆమె తన కళాశాలకు వెళ్లడానికి, అన్నవరం నుండి దువ్వాడకి ట్రైన్ ఎక్కి స్టేషన్‌కి చేరుకుంది. ఈ నేపథ్యంలో ట్రైన్ నుండి ఫ్లాట్ ఫామ్‌కి దిగుతుండగా ప్రమాదవశాత్తూ ట్రైన్‌కి ఫ్లాట్‌ఫామ్ మధ్యలో పడి పోయింది. ఎట్టికేలకు రైల్వే అదికారులు ఫ్లాట్ ఫామ్ పగుల కొట్టి ఆమెను బయటకు తీసి మెరుగైన వైద్యం చేసినప్పటికీ ఫలితం లేక గురువారం ఆమె మత్యువు ఒడికి చేరుకుంది. అప్పటి వరకు తమ ఇంటి నుండి కళాశాలకి చలాకీగా వెళ్లిన తమ ఒక్కగానొక్క కూతురు చని పోవడంతో ఆమె తల్లి దండ్రులు, బంధువులు, తోటి విద్యార్థులు, కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

శశికళ (ఫైల్)

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని తిరుమాలి గ్రామచివారు పంట పొలాలలో సారా తయారీ నిమిత్తం అక్రమంగా నిల్వ ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఏలేశ్వరం ఎస్ఐ సిహెచ్ విద్యాసాగర్ తెలిపారు. దానితో పాటు 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది శివగంగ, శ్రీను, వెంకటరమణ ఉన్నారు.

వైసిపి ఉపాధి కోసమే కార్పొరేషన్ల ఏర్పాటు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

బీసీలకు ఎంతో చేస్తున్నామని వారే తమ పార్టీకి వెన్నుముక అంటూ వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించిన జయహెూ బీసీ సభలో సీఎం జగన్ ఎటువంటి భరోసా, భద్రత ఉపాధి వంటి అంశాలు లేకుండా ప్రసంగిం చడంపై బీసీ ప్రజలు ఎంతో నిరాశకు గురయ్యారని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ మాజీ మేయర్ పి.సరోజ గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వ తీరును విమర్శించారు. బీసీలకు 56 కార్పొరేషన్లకు చైర్మన్లను, డైరెక్టర్లను నియమించారని వారి పదవీకాలం ముగిసినా ఇంతవరకు ఏ ఒక్క బీసీ కులానికి నిధులు గాని, వ్యక్తిగత రుణాలు గాని ఇవ్వలేదన్నారు. జనసేన పార్టీ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రానుందని అప్పుడు బీసీలకు అధిక స్థానాలు, సముచిత గౌరవం కల్పిస్తామన్నారు. కార్పొరేషన్లకు నిధులు ఇవ్వని సీఎం జగన్ విధానాలపై బీసీలు తిరగబడాలని సరోజ పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎంఎల్ఎ దొరబాబు

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కరపత్రాలు అందజేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

గడప గడపకూ... వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి

గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా మండలంలోని అమరవిల్లిలో గురువారం ఎంఎల్ఎ పెండెం దొరబాబు పర్యటించి గడప గడపకు తిరిగి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అమరవిల్లి శివారు తమ్మయ్యపేటలో ప్రజలు మంచినీటి సమస్యపై వివరించగా ఎమ్మెల్యే స్పందించి తొందర్లోనే ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్టు హామీ ఇచ్చారు కార్యక్రమంలో ఎంపిపి కారే సుధాశ్రీనివాస్, వైస్ ఎంపిపి మాదిరెడ్డి దొరబాబు మండల అధ్యక్షులు ఆనాల సుదర్శన్, అమరవిల్లి సర్పంచ్ పులి జయబాబు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు పలకలు పుస్తకాలు అందజేస్తున్న దాతలు

వికలాంగులకు అన్నదానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక భవిత పాఠశాల విద్యార్థులకు ఏలేశ్వరం శివారు అప్పన్నపాలెంకు చెందిన ఎల్ఐసి ఏజెంట్ రౌతు సహదేవుడు కుమార్తె వివాహ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం, పలకలు పుస్తకాలు పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన రోజులు, పెళ్లి రోజుల వంటి శుభదినాలకు పార్టీలు, పబ్బాలు అంటూ వేలాది రూపాయలు వధా చేయకుండా మంచి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మౌనిక, అనిల్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు వాణి, సరస్వతి, బంధువులు ఉన్నారు.

'ఇదేం కర్మ...' అంటూ టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో గురువారం స్థానిక 9,10,11,12 వార్డులలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' అంటూ టిడిపి నాయకులు ప్రచారం నిర్వహించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివద్ధిని, ప్రస్తుత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు,టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ,తూతిక రాజు, కాకినాడ రామారావు, బొడ్డు ఉదయ్, కందుల విశ్వేశ్వరరావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

గౌహతి సదస్సుకు కమిషనర్ రమేష్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

అస్సాం ప్రభుత్వ నిర్వహణలో డిజిటల్ ట్రాన్ఫర్మేషన్ కాన్క్లేవ్ పేరిట ఈ నెల 9 వ తేదీన జరగనున్న సదస్సులో పాల్గొనేందుకు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే.రమేష్ బుధవారం గౌహతి వెళ్లారు. అస్సాం ప్రభుత్వ ఐటి విభాగం ఆధ్వర్యంలో జరిగే ఈ జాతీయస్థాయి సదస్సులో కాకినాడ కమిషనర్ ప్రధాన వక్తగా పాల్గొనున్నారు. డిజిటలైజేషన్ వల్ల కలిగే ప్రయోజనాలు, సంస్కరణలపై ఆయన సదస్సులో ప్రసంగించనున్నారు. నేషనల్ హెల్త్ మిషన్ సిఇఒ డాక్టర్ ఆర్ఎస్ శర్మ, అస్సాం ప్రభుత్వ ఐటి విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ అనురాగ్ గోయల్‌తోపాటు పలువురు సీనియర్ ఐఎఎస్ అధికా రులు, డెలైట్ ఇండియా వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రతినిధులు సదస్సులో పాల్గొననున్నారు.

పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఏడీబీ రోడ్‌లోని చల్లం పౌల్ట్రీ కాంప్లెక్స్ వద్ద గురువారం అంబేద్కర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. సంస్థ యజమాని జి.చందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు ఎం.కన్నబాబు, సభ్యులు ఆరేళ్ల ప్రసాద్, వడ్డపాటి వీరబ్బాయి, రేకు సోనీ, లోడా పేరి బాబు, టీ.అబ్బు, పి.స్వర్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపిపి రాంబాబు మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ కొత్తపల్లి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు రావు ప్రకాశరావు (రాంబాబు 72) గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. ఉదయం ఆయన ఎప్పటిలానే ఉదయం 7.30 గంటలకు పొలంలోకి వెళ్లారు. 11గంటల సమయంలో ఛాతీలో కాస్త నొప్పిగా ఉండటంతో డ్రైవర్ సహాయంతో కాకినాడలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. తెలుగుదేశం పార్టీ 1983లో అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి మండల పరిషత్ వ్యవస్థను ఏర్పాటుచేసిన తరువాత తొలి ప్రత్యక్ష ఎన్నికలలో కొత్తపల్లి మండలపరిషత్ తొలి అధ్యక్షుడుగా టిడిపి తరపున గెలిచిన రాంబాబు వివాద రహితుడుగా, సౌమ్యుడుగా పరిపాలనలో పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. రావు రాంబాబుకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మాజీ ఎంపీపీ రాంబాబు (ఫైల్)

పలువురు నేతల సంతాపం

కొత్తపల్లి తొలి మండల అధ్యక్షుడు రావు ప్రకాశరావు ఆకస్మిక మతి పట్ల పలువురు నేతలు సంతాపం వ్యక్తం చేశారు.పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబు, ఎంపి వంగా గీత, పిఠాపురం మాజీ ఎంఎల్ఏ వర్మ, ఎంపిపి కారే సుధా శ్రీనివాసరావు, వైస్ ఎంపిపిలు మాదిరెడ్డి దొరబాబు, జడ్‌పిటిసి మాజీ సభ్యుడు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు తదితరులు రాంబాబు మతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం వేట్లపాలెం -దోమాడ పాకలకు వెళ్లే అద్వాన్నంగా మారడంతో దాని స్థానే జడ్‌పి నిధులు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టే నూతన రహదారి నిర్మాణ పనులకు గురువారం సాయంత్రం ఏపీ స్టేట్ హౌసింగు కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు దోమడపాకల ప్రజలు చేసిన వినతులను దొరబాబు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఇన్‌చార్జి ఎంపిడిఒ, ఎంపిడిఒ కార్యాలయం ఎఒ వి వీర సాయిబాబు, పంచాయితీ రాజ్ డిఇ రమేష్‌బాబు, మండల ఇంజనీరు మణిమాల, వైసీపీ నాయకులు రాయుడు శ్రీను, నున్న జెమ్మి తదితరులు పాల్గొన్నారు

12న వివిధ వాహనాలకు వేలం

ప్రజాశక్తి - ఆలమూరు

జిల్లాలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఆలమూరు స్టేషన్ పరిధిలో సారా, నాన్ డ్యూటీ వేయిట్ లిక్కర్, డ్యూటీ వేయిట్ లిక్కర్ ఇతర నేరాల్లో పట్టుబడిన వివిధ రకాల 19 వాహనములకు ఈ నెల 12న వేలం వేస్తారని ఎస్ఇబి సిఐ కె.శ్రీధర్, ఎస్ఐ రాంబాబు గురువారం తెలిపారు. 12(సోమవారం) ఉదయం 10 గంటలకు ఆలమూరు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ నందు వేలం పాట ప్రారంభించబడునన్నారు. వేలంలో పాల్గొనదల్చినవారు వారి ఆధార్ కార్డు నకలు తీసికురావాలనన్నారు. ధరావత్తు రూ.2,000 జమచేసి వేలంలో పాల్గొనవలసి ఉంటుందన్నారు. వేలంలో వాహనము దక్కించుకున్న వెంటనే మొత్తం సొమ్మును చెల్లించవలసి ఉంటుందన్నారు. వివరాలకు సెల్‌నెంబర్లలో 95059 68533, 91609 88844 సంప్రదించాలన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

ఇమ్మిడివరప్పాడు, రోళ్లపాలెం గ్రామాల్లో రాష్ట్ర టిడిపి ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమం అమలాపురం మాజీ ఎంఎల్ఎ, అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులతో రచ్చబండ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రజలనుంచి తెలుగుదేశం పార్టీ కి విశేషమైన స్పందన లభిస్తుందని, సభ్యత్వం నమోదు కార్యక్రమం కూడా త్వరగా పూర్తి చేయాలనీ కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చిల్లా జగదీశ్వరి, రాష్ట్ర టిడిపి కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మండలం అధ్యక్షులు మల్లుల పోలయ్య, పెచ్చెట్టి విజయలక్ష్మి, మట్టా మహాలక్ష్మి ప్రభాకరరావు, గొలకోటి చిన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఆనందరావు

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం పురపాలక సంఘ పరిధిలో గడప..గడపకూ.. మన ప్రభుత్వంలో భాగంగా 9 వార్డ్ నందు సిసి రోడ్డు రూ.5 లక్షలతో నిర్మాణ పనుల శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం గురువారము మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమని ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి టౌన్ ప్రెసిడెంట్ సంసాని వెంకట చంద్రశేఖర్, వైస్ చైర్మన్ రుద్రరాజు వెంకటరాజు, మట్టపర్తి నాగేంద్ర, దొమ్మేటి రాము, కట్టోజు సన్నాయి దాసు, బండారు గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఛైర్మన్

హుండీలో సొమ్ములు చోరీ?

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయం లో హుండీ చోరీకి గురైంది. దీనికి సంబంధించి ఆలయ పరిరక్షణ కమిటీ, యాత్రికులు తెలిపిన వివరాలు ఇవి.. ఈ నెల 3న రాత్రి 9 గంటల సమయంలో అశ్వద్ధ వృక్షం వద్ద ఉన్న హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి అందులోనే నగదు దొంగిలించారు. ఆదివారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసే స్వీపర్లు పగిలిన ఉండిని గమనించి ఆలయ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే హుండీని వెంటనే లోపలికి తరలించి విషయాన్ని అధికారులు గోప్యంగానే ఉంచారు. ఆలయంలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసే ఎస్.దుర్గా దాస్ అలియాస్ గుర్కా రాజు శనివారం సెలవులో ఉన్నాడు. అదేరోజు ఆలయంలో వివాహాలు ఎక్కువగా ఉండటంతో ఇదే అదునుగా దొంగలు హుండీ చోరీకి పాల్పడినట్లు సమాచారం. హుండీలో రూ.లక్ష ఉన్నట్లు అంచనా. దీనిపై పోలీసులు ఫిర్యాదు చేశామని ఆలయ సిబ్బంది కొంతమంది తెలియ జేశారు. అయితే ఈఘటనపై లిఖితపూర్వకంగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని ద్రాక్షారం పోలీసులు తెలిపారు.

చోరీకి గురైన హుండీ ఇదే

ఇవన్నీ ఆరోపణలే..

దీనిపై ఇఒ పి. తారకేశ్వరరావు ను ప్రజాశక్తి వివరణ కోరగా చోరీ జరగలేదని ఇవన్నీ ఆరోపణలు మాత్రమేనని అ న్నారు. చోరీ జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేసేవారమన్నారు.

'డ్రగ్స్ ఎపిగా మార్చిన వైసిపి'

ప్రజాశక్తి -రావులపాలెం

అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను వైసిపి ప్రభుత్వం డ్రగ్స్ ఎపిగా మార్చిందని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు ఆరోపించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2021-22 ఏడాదిలో దేశంలో పట్టుబడిన డ్రగ్స్ పై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదికలో మిగిలిన రాష్ట్రాల కంటే అత్యధికంగా కేంద్ర బలగాలు ఏపీలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొందని ఆయన ఆరోపించారు. మత్తు పదార్థాల మాఫియాను పోలీసులు అరికట్టలని తెలుగు యువత తరుపున డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కరుటూరి రవి, మేడపాటి కాసురెడ్డి, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల సమన్వయంతో ఆదాయ వనరులు సమకూర్చుకొని పల్లె ప్రగతి సాధించాలన్నారు. లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం గ్రామాల అభివృద్ధికి పంచాయతీల ద్వారా నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందిస్తూ ప్రగతి సాధించాలని జెడ్‌పిటిసి సభ్యుడు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ, ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి అన్నారు. కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం రెండవ రోజు డిపిజిపి శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రజా ప్రణాళిక ప్రచార కార్యక్రమంలో భాగంగా కాలేరు, అచ్యుతాపురం, వడ్లమూరు, నిరసనమెట్ట, వల్లూరు, నేలటూరు, నల్లూరు, గ్రామాల సర్పంచులకు, ఎంపిటిసి సభ్యులకు, పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ సిబ్బందికి, ఎఎన్ఎంలకు, విఆర్ఒలకు శిక్షణ నిర్వహించారు. గ్రామాల్లో మంచినీటి సౌకర్యం, పారిశుధ్యం పేదరిక నిర్మూలన మౌలిక వసతుల కల్పన పంచాయతీ అభివద్ధి ప్రణాళిక తయారీ తదితర అంశాలపై ట్రైనీ ప్రోగ్రాం సిబ్బంది సిహెచ్ వివి.నరసింహారావు, పి.వెంకటేశులు ఈ శిక్షణలో అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని కృష్ణపాలెం వద్ద గురువారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. కృష్ణ పాలెం దగ్గరలోని దేవరపల్లి-యర్నగూడెం హైవేపై వాహనాలకు ఎదురుగా సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. వెనుక వచ్చిన వాహనాలు సైతం అతనిపైనుంచి వెళ్లడంతో శరీరం గుర్తుపట్టలేని విధంగా నుజ్జునుజ్జయింది. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కెవి.రమణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు మలకపల్లికి చెందిన జి.వెంకటేశ్వరరావు(53) కల్లుగీత కార్మికునిగా జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం గీత పని కోసం వెళ్లి మధ్యాహ్నం వరకు ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతని కోసం గాలించారు. తోటలో విగతజీవిగా కింద పడి ఉన్నాడు. భార్య కనక భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

10న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -కొత్తపేట

పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 10 వ తేదీన శనివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కెపి.రాజు ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 40 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా స్టడీ సెంటర్ విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొత్తపేట స్టడీ సెంటర్ నందు చదివిన పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారన్నారు. విద్యార్థులందరూ విచ్చేసి జయప్రదం చేయాలన్నారు. వివరాలకు ఈ నెంబర్లలో 63056 98749,73829 29716 సంప్రదించాలన్నారు.

దస్తావేజులు పోయినవి

రంధి వేణమ్మ, భర్త: ముత్యాల రావు, ఇర్రిపాక, జగ్గంపేట మండలం, ప్రత్తిపాడు మండలంలో వాకపల్లి గ్రామంలో మా యొక్క రెవెన్యూ తాలూక ప్రత్తిపాడు సబు రిజిష్టర్ ఆఫీసులో రిజిష్టరు కాబడిన సర్వే నెం. 106-2 లో ఖాతా నెంబరు 155 దస్తావేజును తీసుకొని వాకపల్లి నుండి ఆటోలో ప్రత్తిపాడులో జిరాక్సు తీసుకొనుటకు వస్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది సెల్ నెంబరుకు తెలియజేయగలరు.

సెల్: 95151 07584

పాస్‌పోర్టు పోయినది

ముద్రగడ భరత్ కుమార్ అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం వారు ది.10-12-2021న **V4504508 నెంబరు గల పాస్‌పోర్టు** మంజూరు చేశారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు జగ్గంపేట మెయిన్ రోడ్డుకు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. ఎవకిరైనా దొరికినచో ఈ క్రింది చిరునామాకు అందజేయగలరని కోరుచున్నాను.

ముద్రగడ భరత్ కుమార్
తండ్రి: ఉత్తమ కుమార్, డో.నెం. 7-655,
శ్రీరామ నగర్, జగ్గంపేట, కాకినాడ జిల్లా.
పిన్ : 533435

IN THE COURT OF THE III ADDL. JUDICIAL FIRST CLASS MAGISTRATE KAKINADA
C.C.No. 503/2017

Between:
M/S. Shriram City Union Finance Limited, Rajahmundry ***...Complainant***
AND
Vytla Rama Murthy ***...Accused***

Vytla Rama Murthy, S/o. Pattabhiramayya, D.No. 73-22-9/22, Sree Sharwatha Greens Appartment, Flat No.401, Tammareddy Subba Rao Nagar, Narayanapuram Road, Rajahmundry.

In the above matter the complainant filed this petition against you under Sec. 138 of N.I.Act. The Hon'ble court pleased to order notice to you for appearance either personally or through Advocate **on 11-01-2023 at 10:30 A.M. Other wise the matter will be disposed off in your absence.**

GURRAM SRIMANNARAYANA SWAMY,
GURRAM ATCHYUTHA SATYA SAI JYOTHI,
Advocate, Kakinada.
Cell: 98661 91397

IN THE COURT OF THE III ADDL. JUDICIAL FIRST CLASS MAGISTRATE KAKINADA
C.C.No. 18/2017

Between:
M/S. Shriram City Union Finance Limited, Kakinada ***...Complainant***
AND
Palakurthi Satyanarayana Guptha ***...Accused***

Palakurthi Satyanarayana Guptha, S/o. Sri Rama Bapiraju, D.No. 16-12-16, Hospital Veedhi, Peddapuram.

In the above matter the complainant filed this petition against you under Sec. 138 of N.I.Act. The Hon'ble court pleased to order notice to you for appearance either personally or through Advocate **on 10-01-2023 at 10:30 A.M. Other wise the matter will be disposed off in your absence.**

GURRAM SRIMANNARAYANA SWAMY,
GURRAM ATCHYUTHA SATYA SAI JYOTHI,
Advocate, Kakinada.
Cell: 98661 91397